క్లుప్తంగా

పేద ముస్లింలకు రంజాన్ కిట్లు



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న మనోజ్‌రెడ్డి, మత గురువు ఖాజీ అల్తాఫ్ హుసేన్

ఆదోని టౌన్: మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఆదోనిలో పేద ముస్లింలకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మంగళవారం పాత పోస్టాఫీసు ప్రాంతంలోని హవేలీ ఫంక్షన్‌హాలులో ముస్లింల మతగురువు ఖాజీ అల్తాఫ్‌హుసేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో దాదాపు 300 మందికి పైగా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింలకు ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

వాటర్‌ప్లాంట్ పునఃప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాసులు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ గత కొద్ది రోజులుగా మరమ్మతులకు గురైంది. స్పందించిన సీఐ శ్రీనివాసులు మరమ్మతులు చేయించి రూపాయి/రెండు రూపాయలకు 1 లీటర్, ఐదు రూపాయలకు 10 లీటర్ల మంచినీరు వచ్చే విధంగా ఆటోమేటిక్ మిషన్‌ను ఏర్పాటు చేసి మంగళవారం సాయంత్రం ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజుతో కలిసి పునఃప్రారంభించారు. ఎవరైనా డబ్బులు చెల్లించి నీటిని పొందవచ్చని సీఐ వెల్లడించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డు, తిక్కస్వామి దర్గా ఏరియాలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ రఘునాథ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. తిక్కస్వామి దర్గా సర్కిల్‌లో చెత్తాచెదారం ఏరోజుకారోజు తొలగించాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. ఉగాది, రంజాన్ పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో వీధులను శుభ్రంగా ఉంచాలన్నారు. దేవాలయాలు, మసీదులకు వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ



ఎన్‌జీఓస్ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: ప్రజల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు డాక్టర్ షేకస్‌ఖాను, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు ఆధ్వర్యంలో పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివేకానంద హైస్కూల్, కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. 2024 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా తరిమికొడతామని, అందుకు ప్రతిఒక్కరు సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ షేకస్‌ఖాను పిలుపునిచ్చారు. జలుబు, దగ్గు, జ్వరం వరుసగా వచ్చినట్లయితే వెంటనే అందుబాటులో ఉండే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: పట్టణంలోని మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్షయ వ్యాధి, టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయవ్యాధి జాగ్రత్తలను వివరిస్తూ బ్యానర్‌లను పట్టుకొని ఆ పాఠశాల నుంచి ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయవ్యాధి పర్యవేక్షకులు లలితమ్మ, స్వరూప్‌రాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీబీ వచ్చిన రోగికి పౌష్టికాహారం కోసం ప్రతినెలా రూ.500 ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలో జమ చేస్తుందని తెలియజేశారు. హెచ్‌ఎం అలీంసిద్దిఖీ, మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూర్బా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్యస్రవంతి పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 6వ తరగతిలో 40 సీట్లు, 8వ తరగతిలో – 3 సీట్లు, 9వ తరగతిలో–4, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. డ్రాపౌట్ పిల్లలు, బడి బయట పిల్లలు, అనాథ పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు మాత్రమే అర్హులన్నారు. వారికి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 93985 39038 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చిన్నారి బలానికి రాగిజావ





మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, రాంపురంలో రాగిజావ పంపిణీ చేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

ఆదోని అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, జగనన్న గోరుముద్దలో మరో పౌష్టికాహారం రాగిజావ చేర్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత జయమనోజ్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ సుకుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. ఈ మేరకు స్థానిక నెహ్రూమెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యువనాయకుడు జయమనోజ్‌రెడ్డితో పాటు డిప్యూటీ ఈఓ సుకుమార్, ఎంఈఓ శివరాములు, కిలిచినపేట ప్రాథమిక మున్సిపల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సునీల్, ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు విద్యార్థులకు రాగిజావాను అందజేశారు. హెచ్‌ఎం అలీంసిద్దిఖీ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, ఉపాధ్యాయులు బ్రహ్మానందరెడ్డి, విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

కౌతాళం: రాగిజావ ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని ఎంపీటీసీ లింగన్నగౌడు, పీఎంసీ చైర్మన్ వడ్డెరాములు అన్నారు. కౌతాళం జెడ్పీ పాఠశాలలో వారు మంగళవారం విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. గోరుముద్ద పథకంలో పెను మార్పులు చేసి 15 రకాల వంటలతో పాటు ఐదు రోజులు పాటు కోడిగుడ్లు పంపిణీ చేస్తూ చిక్కీలు ఇవ్వడంతో పిల్లల్లో ఆరోగ్య సమస్యలు రక్తహీనత, ఐరన్‌లోపాల వంటి సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: చిన్నతుంబళం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బెల్లంతో కూడిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప ప్రారంభించారు.

ఆదోని రూరల్ : మండగిరి గ్రామ పంచాయతీ రాజీవ్‌గాంధీ నగర్ ఎంపీయూపీ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు పీఎంసీ చైర్మన్ సువర్ణ, మాజీ సర్పంచ్ శేషిరెడ్డి, హెచ్‌ఎం మాదేవప్ప రాగి జావ పంపిణీ చేశారు

మంత్రాలయం రూరల్: రాంపురం గ్రామంలోని పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు వారంలో మూడు రోజుల పాటు రాగిజావ అందించనున్నట్లు ఆయన వివరించారు. అలాగే 52బసాపురంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

కోసిగి: మండలంలో జేబీఎం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ఈరన్న ప్రారంభించారు. అలాగే బాలుర ఉన్నత పాఠశాలలో పీఎంసీ చైర్మన్ పెండేకల్లు ఈరన్న, వైస్ చైర్మన్ వేమారెడ్డి, ఐరన్‌గల్లులో సర్పంచ్ రామాంజనేయులు చేతుల మీదుగా రాగి జావ పంపిణీ చేశారు.



కిలిచినపేటలోని ప్రాథమికోన్నత పాఠశాలలో రాగిజావ అందిస్తున్న ఉపాధ్యాయులు



కోసిగి జేబీఎం ప్రాథమిక పాఠశాలలో రాగి జావ తాగుతున్న విద్యార్థులు

ఆరుగురు విద్యార్థులు డిబార్

ఆదోని అర్బన్: పట్టణంలో ఇంటర్ సెకండియర్ పబ్లిక్ పరీక్షల్లో మంగళవారం ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. స్థానిక సాయి కళాశాలలో ఒక విద్యార్థి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు కర్నూలు ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి తెలిపారు. సదరు విద్యార్థులు మాస్ కాపీయింగ్ చేస్తుండగా కర్నూలు ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుని డిబార్ చేసినట్లు వెల్లడించారు.

కత్తిపోట్లకు గురైన మహిళ మృతి



మహముదా (ఫైల్)

మద్దికెర: స్థానిక మోమిన్ వీధిలో ఉంటున్న మహముదా (35)ను భర్త అహ్మద్ కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. వివరాలు.. మద్దికెరకు చెందిన గౌస్‌మోదీన్, జుబేదా దంపతుల పెద్ద కుమార్తె మహముదాను గుంతకల్లుకు చెందిన అహ్మద్‌కు ఇచ్చి 2009లో వివాహం జరిపించారు. వారికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ఆరు నెలల క్రితం దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడిపోయారు. ఈ క్రమంలో అహ్మద్ సోమవారం మద్దికెరకు వచ్చి భార్యపై కత్తితో దాడిచేయగా ఆమె తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు చికిత్స కోసం గుంతకల్లు వైద్యశాలకు తరలించారు. ఆమె కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. తల్లి చనిపోవడంతో ఇద్దరు చిన్నారులు తల్లడిల్లిపోయారు.

భక్తుల కొంగుబంగారం చౌడేశ్వరీ దేవి

- అలసందగుత్తిలో ఐదు రోజులపాటు ఉగాది ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు



చౌడేశ్వరిదేవి

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అలసందగుత్తి గ్రామ సృష్టికర్తలుగా చౌడేశ్వరి దేవి, సోమేశ్వర స్వామి నామకరణంతో గ్రామం అవతరించిందని పూర్వీకులు చెబుతున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుదీపాలతో అలంకరించారు. తెలుగు దినోత్సవం క్యాలెండర్ ఉగాది అమావాస్య రోజున రంగుల పండగ కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన, వలసలు వెళ్లిన వారు ఉగాది ఉత్సవాలు నిర్వహించేందుకు తప్పకుండా గ్రామం చేరుకోవడం, ఆడపడుచులు పుట్టిళ్లకు చేరుకొని వేడుక జరుపుకోవడం విశేషం. ఉగాది పాడ్యమి రోజు భక్షాలు, కాయకర్పూరం, పూలమాలతో గ్రామంలోని సుంకులమ్మవ్వ, లక్ష్మమ్మవ్వ, గలిదేవర, సెట్టెమ్మవ్వ స్వాములకు సమర్పించి మొక్కులు తీర్చుంటారు. గురువారం సాయంత్రం ఆరు గంటల నుంచి సర్కార్ పోతుకుంభం మొదలుకొని గ్రామంలో ఉన్న కుంభాలను వరుస సంఖ్యలో డప్పు, వాయిద్యాలతో సేకరించి రాత్రి 12 గంటలు దాటిన తర్వాత చౌడేశ్వరి దేవికి కుంభాల్లో ఉన్న నైవేద్యాన్ని సమర్పించి ఆలయం చుట్టూ పోలి చల్లి పొట్టేళ్లను, మేకపోతులను, గేదె పోతులను బలి ఇవ్వడం జరుగుతుంది. బలి చేసిన తర్వాత దేవాలయ ఆవరణలో ఎవరూ బస చేయకుండా గ్రామ పెద్దలు చర్యలు తీసుకుంటారు. బలి ఇచ్చిన రక్తాన్ని రాక్షసులు సేవిస్తారని గ్రామస్తుల నమ్మకం. శుక్రవారం కువజామున 4 గంటలకు సోమేశ్వర స్వామి రథోత్సవం, ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకుని అక్కడ గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మిట్ట మధ్యాహ్నం గ్రామ నడిబొడ్డున వెలిసిన సుంకులమ్మవ్వ దేవి గ్రామ అంచున వెలిసిన లక్ష్మమ్మదేవిలకు కుంభోత్సవం నిర్వహించి పొట్టేళ్లను, మేకపోతులను, గేదె దూడలను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకోవడం, బంధువులందరికీ విందు ఏర్పాటు చేస్తారు. గ్రామంలో ఉగాది ఉత్సవాల కోసం ఆలయ కమిటీ ధర్మకర్త ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

కౌతాళం దర్గాలో అమావాస్య వేడుకలు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సలామ్‌ల ఆలాపాన, ఖాదర్ లింగ స్వామి ప్రవచనలు వినిపించారు. భక్తులు స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.

నేడు పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా పంచాంగ పఠానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ధర్మకర్త మున్నపాషా తెలిపారు. నాలుగు వందల సంవత్సరాల నుంచి వస్తున్న ఆచారం నేటికీ కొనసాగుతోందని, ఉదయమే బ్రహ్మణులు దర్గాకు వచ్చి ప్రత్యేక పూజలు చేపట్టి ఖాదర్‌లింగస్వామి రాశి మకరరాశి గురించి వివరించిన తర్వాతనే ఇతర రాశుల గురించి చెబుతారని వివరించారు.



దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న దృశ్యం

రోడ్డు విస్తరణ చేపట్టాలి

కోసిగి: మండల కేంద్రం కోసిగి నుంచి ఉరుకుంద గ్రామానికి వెళ్లే రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. మంగళవారం అమావాస్య పర్వదినం కావడంతో జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం వేలాది వాహన రాకపోకలు కొనసాగాయి. కోసిగి – ఉరుకుంద వరకు సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహన రాకపోకలకు తీవ అంతరాయం ఏర్పడింది. జుమ్మాలదిన్నె గ్రామం వద్ద రెండు ఎమ్మిగనూరుకు చెందిన ఆర్టీసీ బస్సులు ఎదురు కావడంతో ఎటు వెళ్లలేక దాదాపు అర గంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ద్విచక్రవాహనదారులు ట్రాఫిక్‌లో వేచి ఉండలేక గ్రామంలోకి వెళ్లి అడ్డదారిలో పోవాల్సి వచ్చింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



సింగిల్ రోడ్డులో ట్రాఫిక్‌జామ్ అయిన దృశ్యం

క్రీడాస్ఫూర్తితో రాణించాలి

కౌతాళం: ఓటమి గెలుపునకు తొలిమెట్టు అని బాపురం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథ్‌రెడ్డి అన్నారు. గ్రామంలో వెలసిన అంబా భవానిదేవి జాతర సందర్భంగా మంగళవారం కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఆత్మస్థైర్యంతో ఆటల్లో ముందుకెళ్లాలని సూచించారు. క్రీడలవల్ల మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని తెలిపారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దేవిరెడ్డి, పామిరెడ్డి, అయ్యప్ప, రాఘవరెడ్డి, కబడ్డీ క్రీడాకారులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఉరుకుంద క్షేత్రం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి దేవాలయం మంగళవారం అమావాస్య కావడంతో వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యతో పాటు బుధవారం ఉగాది పండుగ కలిసిరావడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవడానికి అధికంగా తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహరతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, డైరెక్టర్లు, ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ చర్యలు చేపట్టారు.

రామలింగేశ్వర స్వామి దేవాలయంలో

మేళిగనూరులో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర దేవాలయం మంగళవారం భక్తులతో పులకించింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సుళేకేరి గ్రామ శివారులో వెలిసిన బుడుములదొడ్డి ఆంజినేయస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది.



స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచిఉన్న భక్తులు

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



గోనెగండ్లలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఏపీసీ డాక్టర్ కె.వేణుగోపాల్

గోనెగండ్ల: పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. గోనెగండ్లలో మంగళవారం రాత్రి పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఏకాగ్రతతో చదవాలని సూచించారు. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం 8వ తరగతి విద్యార్థుల ఇళ్లకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వాడకాన్ని పరిశీలించి ఆవశ్యకతను తెలియజేశారు. ప్లానింగ్ కో–ఆర్డినేటర్ పి. మారుతి, గర్ల్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.సునీత ఉన్నారు.

నిర్మాణ పనులు నిలిపివేయాలి

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రామచంద్ర నగర్‌లో ప్రార్థనా మందిరం పునర్నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ ఆదోనికి చెందిన కర్ణ, నరసింహులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఏడాది నుంచి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అయితే ఉన్నతాధికారులు, కోర్టు ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు మంగళవారం ప్రార్థనా మందిరం స్థలం, నిర్మాణాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైకోర్టులో కేసు నడుస్తున్నందున ఎలాంటి నిర్మాణం చేపట్టరాదని పాస్టర్ వేదనాయకంకు నోటీసులు అందజేశారు. ప్రార్థనా మందిరం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వీఆర్వో భీమన్నగౌడ్, ఈవో నాగరాజు తదితరులు ఉన్నారు.

సహకరించాలని వినతి : స్థానిక రామచంద్రనగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా సీఎస్‌ఐ ప్రార్థనా మందిరం ఉంది. పాత భవనం కావడంతో ఆ స్థానంలో కొత్తది నిర్మించేందుకు పనులు చేపట్టామని, అందుకు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడికు ప్రార్థనా మందిరం పెద్దలు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.



విచారణ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు

పాఠశాలలో అపరిశుభ్రతపై సబ్‌కలెక్టర్ ఆగ్రహం

ఎమ్మిగనూరురూరల్: మీ ఇంటి పరిసరాలను ఇలాగే అపరిశుభ్రంగా ఉంచుకుంటారా? పాఠశాల అవరణలో మలవిసర్జన చేస్తుంటే మీరేమి చేస్తున్నారంటూ ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఉపాధ్యాయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని కోటేకల్ జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిత తనిఖీ చేశారు. పాఠశాల గదులు, పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. నాడు–నేడు ద్వారా జరుగుతున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అవరణలో మూత్ర, మల విసర్జన చేసి ఉండటం చూసి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల అంటే విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దే దేవాలయం లాంటిదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరిస్తే పాఠశాలను బాగు చూసుకోవచ్చన్నారు. తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థినులతో మాట్లాడి.. ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయా, బోధన ఎలా ఉంది అని ఆరాతీశారు.



కోటేకల్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

కోటేకల్ సచివాలయం తనిఖీ

గ్రామంలోని సచివాలయంను సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టిక, మూమెంట్ రిజిష్టర్, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వైరల్ ఫీవర్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఫీవర్ సర్వే చేయించాలన్నారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి సరైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ బంగారమ్మ, ఎంఈఓ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు ఉన్నారు.